క్లుప్తంగా

155 మందికి వైద్య సేవలు



వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి రాజ్‌కుమార్

కె.కోటపాడు: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా మండలంలో గుల్లేపల్లిలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. 155 మంది రోగులను ఆయన పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలను నిర్వహించి కె.కోటపాడు సీహెచ్‌సీలో స్కానింగ్ పరీక్షలకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌వీ అచ్చియ్యమ్మ, హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు, ఏఎన్ఎం లక్ష్మి, ఆశా కార్యకర్త పైడి తల్లమ్మ పాల్గొన్నారు.

రేపు కె.జె.పురంలో ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో ఈ నెల 24న విశాఖ అనిల్ నీరుకొండ ఆస్పత్రి ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నట్లు భానోదయ గ్రామీణాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎక్స్‌రే, ఇతర స్కానింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి, అవసరమైన వారికి అదే రోజు ఆస్పత్రి బస్సులో సంగివలస తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేస్తారన్నారు. కళ్లు, కాలు, చేతులు, నడుము, గుండె, మూలవ్యాధి, హెర్నియా, కిడ్నీ, తదితర శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహించి ఇంటికి పంపిస్తారన్నారు. పూర్తి వివరాలకు 9885650716 సంప్రదించాలని కోరారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: గాదిరాయి గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ ఆరో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఇక్కడ స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి

మాడుగుల: పట్టణంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చెయ్యాలని మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సరిపోక లోవోల్టేజీ, హైవోల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇటీవల టీవీలు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఎక్కువగా కాలిపోతున్నాయని వాపోయారు. మాడుగుల పట్టణంలో ఎనిమిది వరకు ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం ఉందన్నారు. ముఖ్యంగా అర్బన్ కాలనీ, గణేష్ కాలనీ, నూకాలమ్మ కాలనీలో ఈ సమస్య ఎక్కువగా ఉందని, ఆ శాఖ అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని కోరారు. ఈ విషయంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణతో మాట్లాడించి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఈబీ ఎస్ఐ రహీమ్

గొలుగొండ: యువత సన్మార్గంలో నడవాలని, మంచి విద్యనభ్యసించాలని ఎస్‌ఈబీ ఎస్ఐ రహీమ్ తెలిపారు. శనివారం స్థానిక గురుకుల కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. చెడు వ్యక్తులతో స్నేహాలు చేయొద్దన్నారు. సారా, గంజాయి, మద్యం, సిగిరెట్లు వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. వీటి వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్‌ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



సమావేశానికి హాజరైన నేతలు, కార్యకర్తలు

- ప్రజల కోసం నిరంతర పోరాటం
- గెలుపోటములు సహజం
- పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిన మాజీ ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ భరోసా ఇచ్చారు. సేవ చేసే నాయకులకు గెలుపోటములతో పనిలేదని నిత్యం ప్రజా సమస్యలపై పోరాడతామన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన పార్టీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలూ కృషి చేశారని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించినా గత ఎన్నికల్లో ఓటమి పాలవడం బాధాకరమన్నారు. ఓటమి చెందినప్పటికీ పార్టీ అధినాయకత్వం ప్రత్యేక ప్రణాళికతో ప్రజలకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు విశేషంగా కృషి చేసినప్పటికీ ప్రజా తీర్పు భిన్నంగా వచ్చిందన్నారు. పార్టీ ఓటమి చెందినంత మాత్రాన కార్యకర్తలు కుంగిపోకుండా ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఐదేళ్లలో నియోజకవర్గంలో లక్షలాది మందికి సంక్షేమ పథకాలతోపాటు ఎంతో అభివృద్ధి చేశామన్నారు. కానీ ఓట్లు మాత్రం ప్రతికూలంగా పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదేమైనా ప్రజా తీర్పును గౌరవించి ముందుకు సాగుతామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమల్లో ఎన్డీఏ ప్రభుత్వం విఫలమవుతుందన్నారు. ఏడాదిలోనే ప్రభుత్వంపై ప్రజల నుంచి తిరుగుబాటు వస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్ కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు మాట్లాడుతూ గెలుపోటములను సవాలుగా తీసుకుని మనమంతా పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు పని చేయాలన్నారు. ఆర్నెల్లు ఓపిక పడితే కూటమి పని అయిపోతుందన్నారు. గ్రామ స్థాయి నాయకుల్లో ఉన్న మనస్పర్థలను పక్కన పెట్టి ఐకమత్యంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్డీఏ కూటమి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. పార్టీ కార్యాలయాన్ని కూల్చేశారన్నారు. ఇటువంటి కక్షసాధింపు చర్యలను న్యాయపోరాటం ద్వారా ఎదుర్కొంటామన్నారు. ఎవరూ అధైర్య పడవద్దన్నారు. పార్టీ అధినాయకత్వం అండగా ఉంటుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ నాయకులు చింతకాలయ వరుణ్, ఎంపీపీలు రుత్తల సత్యనారాయణ, సాగిన లక్ష్మణ్‌మూర్తి, గజ్జలపు మణికుమారి, పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, రుత్తల శ్రీనివాసు, లెక్కల సత్యనారాయణ, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, ఎస్సీ సెల్ మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి చేసుకుంటే బహుళ ప్రయోజనాలు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శైలజ

నాతవరం: ఖరీఫ్ సాగు కోసం వరి విత్తనాలు వేసుకునే రైతులంతా కచ్చితంగా విత్తన శుద్ధి చేసుకోవాలని ఏవో శైలజ తెలిపారు. స్థానిక ఆర్బీకేలో శనివారం ఆమె మాట్లాడుతూ విత్తన శుద్ధి చేయడం వల్ల నారు పోసిన ప్రతి గింజ మొలకెత్తుతుందన్నారు. దీని వల్ల రైతుకు వరినారు సమస్య లేకుండా ఉంటుందన్నారు. వరి విత్తనాలు 30 కేజీలకు 250 గ్రాముల సుడోమోనాస్ పొడరు వరినారు వేసే ముందు రోజున కలపాలన్నారు. దీని వల్ల విత్తనాల్లో క్రిమికీటకాలు నాశనమవుతాయన్నారు. వరి నారు ఏపుగా పెరుగుతుందన్నారు. విత్తన శుద్ధి చేసే సుడోమోనాస్ మందు 50 శాతం రాయితీపై రైతులకు సరఫరా చేస్తున్నామన్నారు. సుడోమోనాస్ కేజీ ప్యాకెట్ రాయితీ పోగా రూ.40కే ఇస్తున్నామన్నారు. మండలంలో ఆర్బీకేల్లో 500 కేజీల సుడోమోనాస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 15 వేల ఎకరాల ఆయకట్టులో వరినాట్లు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రైతులు సాగుకు తగ్గట్టుగా వివిధ రకాల వరి విత్తనాలు 1,700 క్వింటాళ్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచామన్నారు. ముందుగా ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారికి పంపిణీ చేస్తున్నామన్నారు.

వైభవంగా నాగవల్లి సంబరాలు



దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ



పూర్ణాహుతి కార్యక్రమంలో భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 14వ వార్షిక కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం నాగవల్లి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఆవరణలో హోమం, భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ధూప, దీప నైవేద్యాల కోసం విరాళాలు అందించిన దాతలను ఈ సందర్భంగా సత్కరించి స్వామివారి చిత్రపటం బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త రాపేట రామకొండలరావు, కోశాధికారి పుట్టా బలరామూర్తి, సభ్యుడు యల్లపు రాము, శ్రీవారి సేవా భక్తులు పాల్గొన్నారు.

డయేరియా నివారణకు ముందస్తు ప్రణాళికలు



సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: కాలానుగుణంగా వస్తున్న వ్యాధులను నివారించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో డ్రైనేజీలు, వీధులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డయేరియా వ్యాపించకుండా రక్షిత పథకాలను క్లోరినేషన్ విధిగా చేయాలన్నారు. కాచిన నీళ్లు తాగాలని, ఇళ్ల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం వచ్చే నెల ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు డయేరియా నివారణ కార్యక్రమం చేయాలని ఆదేశించిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సంయుక్తంగా కార్యక్రయాలు చేయాలన్నారు. వీటితోపాటు పంచాయతీ కార్యదర్శులు సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై దృష్టి సారించాలన్నారు. తాండవ నదిలో నిర్మించిన తాగునీటి పైలట్ ప్రాజెక్టు నుంచి 16 పంచాయతీల ప్రజలకు తాగునీరు సరఫరా చేయడంతో తరుచూ క్లోరినేషన్ వంటి పనులు చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలకు రోగాలు వచ్చే అవకాశాలు ఉంటాయన్నా

అతిసారపై ముందస్తు జాగ్రత్త చర్యలు

మాకవరపాలెం: అతిసార ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో చంద్రరావు, వైద్యాధికారులు శ్రీవిద్య, చరణ్ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఇక గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ నూకరాజు

రోలుగుంట: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టనున్నామని, ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామని ఈవోపీఆర్డీ ఎస్. నూకరాజు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా 15 రోజులకొకసారి వాటర్ ట్యాంకులు శుభ్రపరచడం, బోర్లు, బావుల వద్ద నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రం చేసుకుని తమ ఇళ్ల వద్ద ఎక్కడా నీటి గుంతలు, నిల్వలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నియంత్రణకు గృహ యజమానులు సహకరించాలని కోరారు.

ఈదురు గాలులతో భారీ వర్షం



శుక్రవారం అర్ధరాత్రి వీచిన ఈదురు గాలులకు కారుపై పడిన చింతచెట్టు



వర్షం కారణంగా ప్రవహిస్తున్న బొడ్డేరు గెడ్డ

గొలుగొండ: మండలంలో శుక్రవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో చోద్యం సమీపంలో చర్చి వద్ద చింతచెట్టు నేలకొరిగింది. చెట్టు కింద కారుపై పడటంతో బ్యానెట్ దెబ్బతింది. అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారు వరకు వర్షం కారణంగా బొడ్డేరు, ధారగెడ్డ, బోరింగ్ గెడ్డలు పొంగి ప్రవహించాయి. ఈ గెడ్డల నుంచి ప్రవహించిన వర్షం నీరు తాండవ జలాశయానికి భారీగా చేరింది. పై గెడ్డల ప్రాంతంలో ఖరీఫ్ సాగుకు ఇబ్బందులు ఉండవని, నారుమడులు వేసే సమయంలో ఇటువంటి భారీ వర్షాలు కురవడం చాలా ఆనందంగా ఉందని రైతులు చెబుతున్నారు. శనివారం ఉదయం రోడ్డుపై పడిన చింతచెట్టును పోలీస్, ఆర్‌అండ్‌బీ అధికారులు తొలగించారు.

విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలి



గ్రామంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ



కుసుర్లపూడిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు



గునుపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న హెచ్ఎం శివజ్యోతి, విద్యార్థులు

నర్సీపట్నం: గ్రామాల్లోని బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని హెచ్ఎం కె.రామకృష్ణ సూచించారు. శనివారం వేములపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు విధిగా పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఈ ర్యాలీలో ఉపాధ్యాయుడు జి.రమణ, సీఆర్పీ వెంకట్రావు పాల్గొన్నారు.

కుసర్లపూడిలో ర్యాలీ

రోలుగుంట: హెచ్ఎం శెట్టి మోహన్ ఆధ్వర్యంలో కుసుర్లపూడిలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి గ్రామ వీధుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలలోనే లభిస్తుందని, నిష్ణాతులతో బోధన– అందుబాటులో ఉచిత విద్య, పాఠ్య పుస్తకాలు, తదితర నినాదాలు చేశారు. ర్యాలీలో ఉపాధ్యాయులు విద్యావతి, అప్పన రాంబాబు, సాంబ శివరావు పాల్గొన్నారు.

నాతవరం: బడిఈడు పిల్లలను విధిగా పాఠశాలల్లో చేర్పించే బాధ్యత మనందరిపై ఉందని ప్రధానోపాధ్యాయిని టి. శివజ్యోతి తెలిపారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గునుపూడి పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా చమ్మచింతలోనూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గనుపూడి హెచ్ఎం శివజ్యోతి మాట్లాడుతూ శనివారం ఒక్కరోజే బడి ఈడు పిల్లలను పది మందిని పాఠశాలలో చేర్పించామన్నారు. ఇదే విధంగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బడి ఈడు పిల్లలను చేర్పిస్తే ఆశయం నెరవేరుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలకు వారి తల్లిదండ్రులకు వివరించారు. సీఆర్పీ పోలుపర్తి నాగేశ్వరరావు, ఉపాధ్యాయుడు సత్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుకూలించిన వర్షాలు



వీరనారాయణంలో వరినారు మడి తయారు చేసిన దృశ్యం



తాటిపర్తిలో వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

- వరి నారుమడులు సిద్ధం చేస్తున్న రైతులు
- ఆర్బీకేల్లో విత్తన విక్రయాలు

మాడుగుల/రూరల్: ఈ ఏడాది తొలకరి వర్షాలు ముందుగానే పలకరించడంతో మండల రైతులు ఖరీఫ్ వరి సాగుపై దృష్టి సారించారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలతో వరి నారుమడులు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలో 12 వేల ఎకరాలు వరి సాధారణ విస్తీర్ణం కాగా, గతేడాది ఈ లక్ష్యానికి మించి వరినాట్లు వేశారు. ఖరీఫ్ సీజన్‌కు గాను మండలంలో 22 రైతు భరోసా కేంద్రాలకు వరి విత్తనాలు సరఫరా చేశారు. ఈ విత్తనాలను ఆయా గ్రామాల్లో వీఏఏ, వీహెచ్ఏల సారథ్యంలో పంపిణీ చేస్తున్నారు. వారం రోజులుగా కాసిన ఎండలకు రైతులు ఇంకా వరి విత్తనాలు వెయ్యలేదు. వచ్చే నెల మొదటి వారంలో వరి విత్తనాలు వెయ్యడానికి సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం గ్రామ సచివాలయాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ముందస్తుగా విత్తనాలు రిజిస్ట్రేషన్ చేశారు. వచ్చిన విత్తనాలను వారికి పంపిణీ చేస్తున్నారు.

మేలు రకాల వంగడాల పంపిణీ...

వ్యవసాయ శాఖ మండలానికి ఆర్జీఎల్ 2537, బీపీటీ-5204, ఎంటీయూ 7029, బీపీటీ 3291, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, ఎంటీయూ 1024, ఎంటీయూ 1318 మేలు రకాలైన వంగడాలు 1,200 క్వింటాళ్లు పంపిణీ చేసింది. దీంతో రైతులందరూ వరి విత్తనాలు వేయడానికి నారుమడులు సిద్ధం చేస్తున్నారు. ఈ నెల సాధారణ వర్షపాతం 141 మిల్లీమీటర్లు కాగా, ఇప్పటికే 138 మిల్లీమీటర్లు నమోదవడంతో జలాశయాలు, చెరువుల్లో సాగునీరు చేరడంతో ఖరీఫ్ వరి సాగుకు ఢోకా లేదని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



జంపెనలో వరి నారుమడి సిద్ధం చేస్తున్న రైతు

గత ప్రభుత్వంలోనే విత్తనాలకు ఇండెంట్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఏటా మాదిరిగానే వరి విత్తనాల కోసం వ్యవసాయ శాఖ అధికారులు ఇండెంట్ పెట్టారు. మే నెలలో ఇండెంట్ పెట్టగా, ఈ నెలలో విత్తనాలు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలకు చేరుకుంటున్నాయి. దాంతో రైతులకు ఎక్కడా విత్తనాల కష్టం ఎదురు కాలేదు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



ప్రైవేట్ పాఠశాల వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనకాపల్లి: జిల్లాలోఅధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాబ్జి, ఫణీంద్ర కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక పూల్‌బాగ్‌రోడ్డులో ఓ ప్రైవేట్ పాఠశాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మారుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. ఈ విషయంపై విద్యాశాఖాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా స్పందించకపోవడంతో ధర్నా చేసినట్లు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జగదీష్, తాతాజీ, రాకేష్, సంపత్, ప్రసాద్ పాల్గొన్నారు.

హరేకృష్ణ ఆశ్రమ భవనం ప్రారంభం

అనకాపల్లి: స్థానిక జాతీయరహదారి జలగల మధుం సమీపంలో హరేకృష్ణ సత్సంగ ఆశ్రమ నూతన భవనాన్ని ప్రారంభించినట్లు ఆశ్రమ అధ్యక్షుడు దుర్గభ కృష్ణ ప్రేమదాస్ చెప్పారు. అక్కడ శనివారం జగన్నాథ స్వామి, బలదేవ, సుభద్రా దేవిల మూర్తులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్వామివారికి కలశారాధన, శ్రీ లక్ష్మీనృసింహ శ్రీ సుదర్శన మహాయజ్ఞం, మహాకలశాభిషేకం, శ్రీ మద్భాగవత ప్రవచనం, మధ్యాహ్నం అన్నసమారాధన తదితర కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు.

వేతన బకాయిల కోసం పారిశుధ్య కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కశింకోట: తమకు రావలసిన వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక పంచాయతీ పారిశుధ్య కార్మికులు శనివారం ఎంపీడీవో కార్యాలయంవద్ద శనివారం ధర్నా చేశారు. ఏడు నెలలుగా రావలసిన వేతనాలు చెల్లించకపోతే తమ సమ్మె కొనసాగిస్తామన్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యాలయంలో కూడా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఈవోఆర్డీ సోమరాజుకు వినతిపత్రం అందజేశారు.సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కశింకోట: తాళ్లపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి.గ్రేస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ఎస్సీలకు 29, ఎస్టీ, బీసీలకు చెరొకటి, 7వ తరగతిలో ఎస్సీలకు 3, ఎనిమిదో తరగతిలో ఎస్సీలకు 2, ఓసీలకు ఒకటి, 9వ తరగతిలో ఎస్సీలకు 4 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తిగల విద్యా ర్థులు ఈ నెల 26లోగా పాఠశాలలో నేరుగా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. ఈ నెల 28న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, ఇందులో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు.